# సాక్షి
## పశ్చిమగోదావరి

గురువారం । 23 । మార్చి । 2023




**మందుల దందా**

జిల్లాలో అబార్షన్ కిట్లు, వయాగ్రా, మత్తు మందుల దిగుమతిపై దృష్టిపెట్టారు. కర్ణాటక, గుజరాత్ నుంచి అవి సరఫరా అయినట్లు గుర్తించారు. 8లో



**మొక్కల ఆరోగ్యాన్ని ముందే పట్టేద్దాం**

పంటలలో తెగుళ్ల నివారణకు బృహత్తర కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రతి మండలంలో ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. 8లో



**స్మారక చిహ్నం ఆవిష్కరణ**

ఏలూరు కోటదిబ్బలోని మాజీ సైనికోద్యోగుల అసోసియేషన్ కార్యాలయ ఆవరణలో అమర్ జవాన్ స్మారక చిహ్నాన్ని (ఐకాన్) కలెక్టర్ ఆవిష్కరించారు. 8లో

## న్యూస్‌రీల్

### పద్య కవిత పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

**తణుకు టౌన్:** ఉగాది వేడుకలు తణుకు నన్నయ భట్టారక పీఠం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉగాది వేడుకలు పురస్కరించుకుని తణుకులోని గోస్తనీ వంతెనపై ఉన్న నన్నయ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తణుకు సజ్జాపురంలోని రామకృష్ణ సేవా సమితిలో ఉగాది సందర్భంగా పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర, జిల్లా స్థాయి పద్య కవిత పోటీలు, పద్య పఠన పోటీలలో విజేతలైన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పీఠం అధ్యక్షుడు జీఎస్ సుబ్రహ్మణ్యం, పారిశ్రామికవేత్త చిలుకూరి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కొల్లి రామచంద్రశర్మ, కోశాధికారి సుశర్మ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### ఆలిండియా టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం



భీమవరం కాస్మో క్లబ్‌లో టోర్నమెంట్ ప్రారంభం సందర్భంగా బెలూన్స్ ఎగురువేస్తున్న దృశ్యం

**సాక్షి, భీమవరం :** క్రీడలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్‌లో జాతీయస్థాయి టెన్నిస్, వాలీబాల్ వంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ కార్యదర్శి పి.వెంకట రామరాజు అన్నారు. బుధవారం జాతీయ స్థాయి టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు అల్లూరి పద్మరాజు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. 1982లో క్లబ్ ఏర్పడిన నాటి నుంచి జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామన్నారు. పోటీల నిర్వహణకు క్లబ్ సభ్యులతోపాటు వెర్‌టెక్స్ మేనేజింగ్ డైరెక్టర్ వేగేశ్న వెంకటరాయ్‌వర్మ, కొంతమంది దాతలు సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. క్రీడాకారులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పించడం వల్ల అనేక ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పోటీల్లో పాల్గొంటున్నారని రానున్న రోజుల్లో మరిన్ని పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి వీవీఎస్ఎస్ వర్మ, ఏపీఎస్‌టీపీఏ సెక్రటరీ ఎ.రాంబాబు, కె.రామకృష్ణంరాజు, డీఎస్ఎన్ రాజు, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

### 29న మార్టేరులో కిసాన్ మేళా

**ఉండి:** ఈ నెల 29న ప్రాంతీయ వరి పరిశోధనా స్థానం మార్టేరులో జరిగే కిసాన్‌మేళా కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొనాలని ఎన్నార్పీ అగ్రహారం కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లికార్జున రావు కోరారు. సుస్థిర వ్యవసాయం, స్థిరమైన ఆదాయం అనే అంశంపై రైతులకు వరిసాగులో పలు మెళకువలు తెలియజేస్తారన్నారు.

### కళలతో ఒత్తిడి నుంచి ఉపశమనం



పోటీల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న బుద్దాల రామారావు

**తాడేపల్లిగూడెం:** ఒత్తిడి నుంచి కళల ద్వారానే ఉపశమనం కలుగుతుందని జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీల్లో పలువురు వక్తలు పేర్కొన్నారు. ఉగాది సందర్భంగా భారతీయ విద్యాభవన్స్, ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సౌజన్యంతో జరిగిన గుండుమోగుల కృష్ణారావు, ఆదిలక్ష్మి దంపతుల స్మారక నాటికల పోటీల్లో వల్లా వఝల శ్రీరామకృష్ణ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. నాటిక పోటీల ప్రారంభం గురించి కళాకేంద్రం వ్యవస్థాపకుడు బుద్దాల వెంకటరామారావు వివరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, అప్పడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురాంనాయుడు, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, ఉగాది విశిష్ట సేవా పురస్కార గ్రహీతలు లలితా రైస్ ఎండీ, మట్టే సత్యప్రసాద్, కమల, దాయన సురేష్ చంద్రజీ, లయన్ నాయకులు గట్టిం మాణిక్యాలరావు, ఎన్.వీ. రమణరావు, పేరిచర్ల మురళీకృష్ణంరాజు తదితరులు మాట్లాడారు.

# చూసిన కనులదే భాగ్యం

## వేడుకగా శ్రీవారికి ఉగాది ఉత్సవం



ఉగాది మండపంలో పంచాంగ శ్రవణం

**ద్వారకాతిరుమల:** శ్రీవారి క్షేత్రంలో ఉగాది ఉత్సవం బుధవారం రాత్రి కనుల పండువగా జరిగింది. స్థానిక ఉగాది మండపంలో ఈ వేడుకను అర్చకులు, పండితులు వైభవోపేతంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లు మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ ఆలయం నుంచి ఉగాది మండపం వద్దకు వెండి శేష వాహనంపై తరలివచ్చారు.

ఉభయ దేవేరులతో శ్రీవారు కొలువైన శేషవాహనం ఉగాది మండపం వద్దకు చేరుకునే సరికి అక్కడున్న భక్తులు ఎంతో భక్తి ప్రపత్తులతో స్వామి వారికి నీరాజనాలు సమర్పించారు. మండపంలో ఏర్పాటు చేసిన రజిత సింహాసనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వేంచేపు చేసి ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అర్చకులు, పండితులు శ్రీ శోభకృత్ నామ సంవత్సర పంచాంగ శ్రవణాన్ని పఠించి, రాశి ఫలాలను చదివి భక్తులకు వినిపించారు. అలాగే శ్రీవారు, అమ్మవార్లకు నీరాజనాలను సమర్పించారు. ఉగాది ఉత్సవం జరగడానికి ముందు స్వామివారి నిత్య కల్యాణ మండపంలో పండితులను, అర్చకులను, దాతలను ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ.నివృతరావు ఘనంగా సత్కరించారు. అనంతరం వేదిక మీద వెండి శేషవాహనంపై కొలువైన స్వామి, అమ్మవార్లకు అర్చకులు హారతులిచ్చారు. శ్రీవారి క్షేత్రం భక్తజన సంద్రమైంది. తెలుగు నూతన సంవత్సరం తొలిరోజు స్వామి, అమ్మవార్లను దర్శిస్తే ఏడాదంతా సకల శుభాలు కలుగుతాయన్నది భక్తుల నమ్మకం. పెద్ద ఎత్తున భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఈవో త్రినాథరావు పాల్గొన్నారు.



పండిత సత్కార వేడుకలో స్వామి, అమ్మవార్లకు హారతులిస్తున్న అర్చకులు

# వశిష్ట వారధికి త్వరలో శ్రీకారం

- మరో రెండు రోజుల్లో టెండర్లు పిలిచేందుకు ముహూర్తం
- కాల వ్యవధిలో పనులు పూర్తయ్యేలా ప్రణాళిక
- సీఎం కృషి, ముదునూరి చొరవతో కల సాకారం



నరసాపురం వద్ద పంటుపై రేవు దాటుతున్న ప్రయాణికులు

**నరసాపురం:** నరసాపురం నియోజకవర్గంలో గతేడాది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.3,300 కోట్ల ప్రాజెక్ట్‌లకు శంకుస్థాపన చేశారు. అయితే ప్రతిపక్షాలు కోర్టు చిక్కులు కలిగించడంతో కీలకమైన వశిష్ట గోదావరిపై వంతెన నిర్మాణాన్ని ఆ సమయంలో సీఎం ప్రారంభించలేకపోయారు. అదే బహిరంగ వేదికపై 2, 3 నెలల్లో వశిష్ట వంతెనకు టెండర్లు పిలుస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. చెప్పిన 4 నెలల్లోనే వశిష్ట వంతెన అంశాన్ని టెండర్ల దశకు తీసుకొచ్చారు. కోనసీమ జిల్లా చించినాడ మీదుగా నరసాపురం నుంచి ఒంగోలు వరకూ నిర్మించిన 216 జాతీయ రహదారికి బైపాస్ నిర్మించడం ద్వారా వంతెన నిర్మాణం చేపడతారు. మొత్తం 22 కిలోమీటర్ల మేర రోడ్డు, 380 మీటర్ల మేర వంతెన నిర్మాణానికి రూ 580.42 కోట్లు మంజూరు చేస్తూ ఈ నెల 16న మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ నేషనల్ హైవే అథారిటీ ఉత్తర్వులిచ్చింది. వెంటనే టెండర్లు పిలవాలని సంస్థ డైరెక్టర్ అండ్ జనరల్ రవిచంచల్ ఆదేశాలిచ్చారు. మరో 2,3 రోజుల్లో టెండర్లు పిలిచేందుకు ముహూర్తం సిద్ధమైంది.

**24 నెలల్లోనే పనులు పూర్తయ్యేలా..**

రెండేళ్ల కాల వ్యవధిలో పనులు పూర్తిచేసేలా టెండర్లు పిలుస్తున్నారు. అలాగే బైపాస్‌రోడ్డు, గోదావరిపై వంతెన నిర్మాణానికి సంబంధించి మంజూరు చేసిన నిధులు ఏ సంవత్సరంలో ఎంతమేర మంజూరు చేస్తారనే అంశాలను కూడా కేంద్ర ప్రభుత్వం క్లుప్తంగా ఉత్తర్వుల్లో పేర్కొనడం విశేషం. 2023–24 ఆర్థిక సంవవత్సరంలో 20 శాతం నిధులు, 2024–25లో 65 శాతం, 2028–26 సంవత్సరంలో మిగిలిన 15 శాతం నిధులు కేంద్రం మంజూరు చేయనుంది. ఈపీసీ మోడ్ పద్ధతిలో పనులు కొనసాగిస్తారు. ఉభయగోదావరి జిల్లాలను కలుపుతూ ప్రస్తుతం అటు కోనసీమ, ఇటు పశ్చిమగోదావరి జిల్లాల మధ్య వశిష్ట గోదావరిపై నరసాపురంలో వంతెన నిర్మించాలనేది దశాబ్దాల డిమాండ్. ఎప్పుడో బ్రిటిష్ హయాంలోనే అంకురార్పణ జరిగిన ఈ వంతెన నిర్మాణం దశాబ్దాలుగా కలగా మిగిలిపోయింది. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా వంతెన నిర్మాణం ప్రారంభమవుతుందన్న తరుణంలో ఆయన అకాల మృతితో ఆ ప్రయత్నం కూడా ఆగిపోయింది. మళ్లీ ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వంతెన నిర్మాణంపై దృష్టిపెట్టి పనిచేయడంతో గోదావరి జిల్లాల చిరకాల వాంఛ నెరవేరబోతుంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్లు స్థలసేకరణ కోసం మంజూరు చేసింది. స్థలసేకరణ కూడా పూర్తయ్యింది. ప్రతిపక్షాలకు చెందిన కొందరు అడ్డంకులు సృష్టించడానికి స్థల సేకరణ అంశంలో కోర్టుకు వెళ్లి స్టే తీసుకొచ్చారు. అయితే చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు గట్టి ప్రయత్నం చేసి స్టేను వెకేట్ చేయించారు. తాజాగా హైకోర్టులో ప్రతిపక్షాల ప్రోద్బలంతో వేసిన కేసును కోర్టు కొట్టేసింది.

**సీఎం, చీఫ్ విప్ చొరవతో..**

చించినాడ 216 జాతీయ రహదారికి కోనసీమ జిల్లా నుంచి నరసాపురం వరకూ బైపాస్ నిర్మించి, మధ్యలో గోదావరిపై వంతెన నిర్మిస్తే ఈ ప్రాజెక్ట్‌కు మోక్షం కలుగుతుందని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ముఖ్యమంత్రికి వివరించారు. దీంతో ముఖ్యమంత్రి జగన్ స్వయంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాయడం, శివకోడు సఖినేటిపల్లి మీదుగా రామేశ్వరం నుంచి నరసాపురం వరకూ 22 కిలోమీటర్ల మేర స్టేట్ హైవేను 216 కు బైపాస్‌గా మార్చాలని.. మధ్యలో రాజుల్లంక వద్ద గోదావరిపై వంతెన నిర్మించాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్ లేఖకు స్పందించిన గడ్కరీ వెంటనే ఆమోదం చెప్పడంతో వంతెన సమస్యకు లైన్ క్లియరైంది.

**వైఎస్సార్ హయాంలోనే..**

ఎన్టీఆర్ తరువాత నరసాపురం వశిష్ట వంతెనకు బీజం వేసింది దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి. 2008 ఏప్రిల్ 16న వశిష్ట వంతెనకు శంకుస్థాపన చేశారు. వెంటనే టెండర్లు పిలిచి రూ.194 కోట్లతో పనులు సత్యం కంపెనీకి చెందిన నిర్మాణ సంస్థ మైటాస్‌కు అప్పగించారు. సర్వే పూర్తయ్యి, పనులు ప్రారంభం అయ్యే సమయానికి సత్యం సంస్థ సంక్షోభంలో పడి పనులు నిలిచిపోయాయి. వైఎస్ మళ్లీ పనులు వేరే కంపెనీకి అప్పగించారు. మళ్లీ ఈ అంశం కోర్టుకెక్కింది. 2014 నుంచి అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం కోర్టులో స్టే వెకేట్ చేయించే ప్రయత్నం కూడా చేయకుండా, వంతెన కట్టేస్తున్నామంటూ ప్రతిరోజూ డ్రామాలు నడుపుతూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేసింది.

**వశిష్ట వంతెన కట్టి తీరుతాం**



ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ నిధులతో స్థల సేకరణ పూర్తి చేశాం. మరో 2, 3 రోజుల్లో టెండర్లు పిలుస్తాము. రెండేళ్ల కాల వ్యవధిలో పనులు పూర్తయ్యేలా టెండర్లు ఖరారు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. వశిష్ట వంతెన కట్టి తీరుతాం. 2008లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ వంతెనకు శంకుస్థాపన చేశారు. ఆయన మృతితో వంతెన ఆగిపోయింది. టీడీపీ ప్రభుత్వం వంతెన విషయంలో అనేక డ్రామాలు నడిపింది. జగన్‌మోహన్‌రెడ్డి వంతెన నిర్మాణానికి పూనుకుంటున్నారు.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

## ప్రజలందరికీ మంచి జరగాలి



తణుకులో పంచాంగాన్ని ఆవిష్కరించిన మంత్రి కారుమూరి దంపతులు

**తణుకు అర్బన్ :** శ్రీ శోభకృత్ నామ సంవత్సరంలో రాష్ట్రంలోని ప్రజలందరికీ మంచి జరగాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆకాంక్షించారు. తణుకు రాష్ట్రపతి రోడ్డులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన పంచాంగ శ్రవణం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఉగాది సందర్భంగా ఆలయంలో వేంచేసియున్న శ్రీవేంకటేశ్వరస్వామికి మంత్రి కారుమూరి, లక్ష్మీకిరణ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం బ్రహ్మశ్రీ ప్రదీప్ సిద్ధాంతి నిర్వహించిన పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి దంపతులకు ఘనంగా సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఆలయ చైర్మన్ కొత్తపల్లి రామచంద్రరావు, రాష్ట్ర చేనేత కార్పొరేషన్ మాజీ చైర్మన్ వావిలాల సరళాదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.అన్నపూర్ణాదేవి, తాటిపర్తి వాసు, కొమ్మోజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఉగాది వేడుకలు



వేద పండితులను సత్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు

**ఏలూరు(మెట్రో) :** జిల్లా ప్రజలందరూ సుఖ శాంతులతో వర్ధిల్లాలని, ఆయురారోగ్యాలతో జీవించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరికి శ్రీ శోభకృత్ నామ తెలుగు సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. ఏలూరు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి తెలుగు ఉగాది వేడుకలను జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు ప్రారంభించారు. అనంతరం బ్రహ్మశ్రీ కిళంబి మారుతీ, యనమండ్ర రవిప్రకాష్ వేదపఠనం చేశారు. ఈ సందర్భంగా జేసీ అరుణ్ బాబు మాట్లాడుతూ ఈ ఏడాది ఉద్యోగ, విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి మంచి స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అందరూ ఆనందంగా జీవించాలని, అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని కోరుకుంటున్నానన్నారు. ఏ స్థాయిలో ఉన్నా, ఏ దేశంలో ఉన్నా జన్మభూమి, సంస్కృతిని గొప్పగా చెప్పుకోవాలన్నారు. ఉగాది పచ్చడిలో ఉన్న సారాంశం ప్రకారం జీవితంలోని తీపి, పులుపు, చేదు, వగరు, ఉప్పు, కారం, వంటివి మన జీవితంలో సమపాళ్లలో స్వీకరించాలన్నారు. రాబోయే రోజుల్లో ఉద్యోగులంతా మరింత సమర్థవంతంగా పనిచేసి జిల్లా సమగ్ర అభివృద్ధికి దోహదపడాలన్నారు. విద్యార్థులందరూ చక్కగా చదువుకొని విజయాలందుకుని తమ తల్లిదండ్రులకు, గ్రామానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు పేట శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు కిళంబి మారుతి పంచాంగ శ్రవణం చేశారు. శ్రీ కిళంబి మారుతి, యనమండ్ర రవిప్రకాష్, యడవల్లి శ్రీనివాసరావులను సత్కరించారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబు, జిల్లా రెవిన్యూ అధికారి ఎవీఎస్ఎస్ మూర్తి, ట్రైనీ కలెక్టర్ అపూర్వ భరత్, ఏలూరు ఆర్డీఓ కె.పెంచలకిషోర్‌లను శాలువలతో సత్కరించారు. ఆర్‌టీసీ పీఆర్‌వో నరసింహం వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

# దేవాలయాల పరిరక్షణకు సీఎం జగన్ కృషి

**డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ**

**తాడేపల్లిగూడెం అర్బన్:** దేవదాయ శాఖలో విధులు నిర్వహించడం, సేవలందించడం పూర్వజన్మ సుకృతమని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. రాష్ట్రంలో దేవాలయాల పరిరక్షణకు సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. శోభకృత్ ఉగాది పురస్కారాల ప్రదానం కార్యక్రమాన్ని దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ కె.విజయరాజు అధ్యక్షతన స్థానిక మాగంటి కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ దేవుడికి చేరువగా సేవలందించే అవకాశం రావడం దేవదాయ శాఖ మంత్రిగా తనకు, శాఖలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు అదృష్టమన్నారు. అర్చకస్వాములు, ఉద్యోగులు నీతినిజాయితీలో విధులు నిర్వహించాలన్నారు. హైందవ ధర్మాన్ని నలుమూలలకు ఇనుమడింప చేసేలా చిత్తశుద్ధితో సేవలందించాలన్నారు.

ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి దేవాలయాల పరిరక్షణ, నూతన ఆలయాల నిర్మాణాలకు వందల కోట్ల నిధులు సమకూరుస్తున్నారన్నారు. రాష్ట్రంలో గతంలో 1625 దేవాలయాల్లో ధూపదీప నైవేద్యాలు నిర్వహించేవారన్నారు. జగన్ ప్రభుత్వంలో 5 వేల ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలు నిర్వహించేందుకు నెలకు రూ.5వేలు చొప్పున అందజేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 3 వేల నూతన ఆలయాల నిర్మాణానికి మొదటి విడతగా రూ.300 కోట్లు విడుదల చేశారన్నారు. ముఖ్యమంత్రి జగన్ చేస్తున్న సుపరిపాలనను తప్పుదారి పట్టించేందుకు కొన్ని దుష్టశక్తులు ప్రయత్నిస్తున్నాయని వాటిని భగవంతుడి సహకారంతో జగన్ తిప్పి కొడుతున్నారన్నారు. కొందరు అవినీతి పరులు వందల కోట్ల విలువైన దేవుని భూములను అన్యాక్రాంతం చేసి అనుభవిస్తున్నారన్నారు. వాటిని దేవునికే స్వాధీన పర్చేలా దేవదాయ శాఖ ఉన్నతాధికారులు సహకరించాలని కోరారు. సమావేశంలో దేవదాయ శాఖ ప్రాంతీయ కమిషనర్లు, స్థపతులు, దేవలయ కార్యాలయాల అధికారులు, ఏడు జిల్లాల అర్చకులు పాల్గొన్నారు. సభానంతరం అర్చక స్వాములకు శోభకృత్ ఉగాది పురస్కారాలను అందచేశారు. తొలుత మంత్రి కొట్టును గజమాల, మెమెంటోలతో సత్కరించారు.



అర్చక స్వాములకు ఉగాది పురస్కార సత్కారం చేస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



మంత్రి కొట్టు సత్యనారాయణను సత్కరిస్తున్న దేవదాయ శాఖ సిబ్బంది

# ముఖ్యమంత్రి పర్యటన పనులు పరిశీలన

**దెందులూరు:** దెందులూరులో ఈ నెల 25న వైఎస్సార్ ఆసరా మూడో విడత కార్యక్రమం ప్రారంభానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దెందులూరు రానున్న నేపథ్యంలో బుధవారం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్,, జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబుతో కలిసి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్ నిర్మాణ పనులను పరిశీలించి సభా స్థలి వరకు రెండు రోడ్డు మార్గాలను బారికేడ్లతో ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్ వద్ద మంత్రులు, శాసన సభ్యులు ముఖ్యమంత్రికి స్వాగతం పలకడానికి ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. హెలిప్యాడ్ నుంచి సభా స్థలానికి వెళ్ళే ముఖ్యమంత్రి కాన్వాయ్ మార్గంలోను, సభాస్థలి వద్ద ఎలాంటి ప్లాస్టిక్, వ్యర్థ పదార్థాలు లేకుండా పకడ్బందీగా పారిశుధ్యాన్ని నిర్వహించాలని డీపీఓకు సూచనలు చేశారు. సభా స్థలివద్ద డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఐదు స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని డీఆర్‌డీఏ పీడీ విజయరాజును ఆదేశించారు. కలెక్టర్ వెంట డీపీఓ మల్లికార్జునరావు, ఆర్ అండ్ బీ అధికారులు, ఏలూరు ఆర్‌డీఓ పెంచల కిషోర్, దెందులూరు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.



సీఎం సభకు చురుగ్గా సాగుతున్న ఏర్పాట్లు



సీఎం సభకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జేసీ అరుణ్‌బాబు

## కుంకుళ్లమ్మకు లక్ష గాజుల అలంకరణ



చినవెంకన్న ఆలయానికి ఉపాలయమై, క్షేత్ర దేవతగా విరాజిల్లుతోన్న శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారు లక్ష గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నెల 30న ముగియనున్న ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం కుంకుమార్చనతో పాటు, గాజుల అలంకరణ చేయనున్నారు.

–ద్వారకాతిరుమల

# విచ్చలవిడిగా మందుల దందా

- ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు అక్రమంగా సరఫరా
- తప్పుడు ఏజెన్సీల ద్వారా యథేచ్ఛగా విక్రయాలు
- తణుకులో మొదలై రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు
- ముంబై, గుజరాత్ ఫార్మా కంపెనీల్లోనూ ఔషధ నియంత్రణ శాఖ అధికారుల బృందాల తనిఖీలు


తణుకు ఔషధ నియంత్రణ శాఖ అధికారులు ఇటీవల స్వాధీనం చేసుకున్న మందులు

**తణుకు:** పొరుగు రాష్ట్రాల నుంచి భారీగా అబార్షన్ కిట్లు, వయాగ్రా, మత్తు మందుల దిగుమతి వ్యవహారం తణుకులో బట్టబయలైన విషయం తెలిసిందే. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా ఇటీవల ఔషధ నియంత్రణ శాఖ అధికారులు చేపట్టిన దాడుల్లో పెద్ద ఎత్తున అక్రమ మందులు స్వాధీనం చేసుకున్నారు. కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే రూ.30 లక్షల విలువైన నిషేధిత మందులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉంటే కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల నుంచి సుమారు రూ.2 కోట్ల విలువైన నిషేధిత మందులు రాష్ట్రానికి సరఫరా అయినట్లుగా గుర్తించిన అధికారులు ఆ దిశగా విచారణ చేపట్టారు. ఇటీవల హుబ్లీ, కర్ణాటక ప్రాంతాల్లో తనిఖీలు చేసిన ఔషధ నియంత్రణ శాఖ ప్రత్యేక బృందాలు పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు నిర్ధారించాయి. అయితే వీటి మూలాలు ముంబైలో ఉన్నట్లు తేలడంతో తాజాగా ప్రత్యేక బృందాలు అక్కడకు వెళ్లాయి. అయితే ఇంత పెద్ద మొత్తంలో మందులు ఎక్కడకు చేరుతున్నాయి? ఎవరు వినియోగిస్తున్నారు? అనే కోణంలో అధికారులు కూపీ లాగుతున్నారు.

**కదిలిన మందుల డొంక**

పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణంలో అక్రమ మందుల దందా జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో తణుకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అబిద్ అలీ నేతృత్వంలో చేపట్టిన తనిఖీల్లో విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూశాయి. కేవలం నిద్రమాత్రలే కాకుండా అబార్షన్ కిట్లు, వయాగ్రా వంటి నిషేధిత మందులు సైతం మార్కెట్‌లో విచ్చలవిడిగా చెలామణీ అవుతున్న విషయాన్ని గుర్తించిన అధికారులు ఆ దిశగా సోదాలు చేపట్టారు. తణుకు, భీమవరం, ఏలూరు ప్రాంతాల్లో పెద్ద మొత్తంలో నిషేధిత మందులను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఇవి ఎలా దిగుమతి చేసుకుంటున్నారనే కోణంలో ఆరా తీసిన అధికారులకు బెంగళూరు, గుజరాత్ కేంద్రాలుగా నిషేధిత మందులను రాష్ట్రానికి దిగుమతి చేసుకుంటున్నారని గుర్తించారు. మందుల తయారీ కంపెనీలు తప్పుడు ఏజెన్సీల ద్వారా పెద్ద ఎత్తున ఎగుమతి చేస్తున్నారు. వైద్యులు సూచనల మేరకు విక్రయించాల్సిన మందులను విచ్చలవిడిగా మార్కెట్‌లో అమ్మకాలకు ఉంచారు. ఈ మందులను ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాలతోపాటు కృష్ణా, గుంటూరు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ గుర్తింపు లేని కొందరు వ్యక్తులకు విక్రయిస్తుండగా, వీటికి బిల్లులు లేకపోగా జీఎస్టీ సైతం చెల్లించరు. దీంతో ప్రభుత్వానికి పన్నుల రూపంలో రావాల్సిన రూ.కోట్లు ఆదాయానికి గండి పడటంతోపాటు ప్రజల ప్రాణాలు సైతం గాల్లో కలిసిపోతున్నాయి.

**బాధ్యులపై చర్యలు తీసుకుంటాం**

నిషేధిత మందులు రాష్ట్రానికి సరఫరా, విక్రయాలపై దృష్టి సారించాం. ఇప్పటికే పలు జిల్లాల్లో తనిఖీలు నిర్వహించి నిషేధిత మందులు, అక్రమాలు గుర్తించాం. కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి సరఫరా అవుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించాం. మరోసారి అధికారుల బృందం తనిఖీలు చేపట్టాల్సి ఉంది. ఈ వ్యవహారంలో బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకుంటాం.

– ఎంపీఆర్ ప్రసాద్, డెప్యూటీ డైరెక్టర్, ఔషధ నియంత్రణ శాఖ

**మాఫియా గుట్టురట్టు**

బెంగళూరుకు చెందిన ఐశ్వర్య ఫార్మా సంస్థ ఏలూరుకు చెందిన పి.నగేష్‌కు ఏడాది కాలంలో 30 వేల అబార్షన్ కిట్లు సరఫరా చేసింది. వీటి విలువ రూ.1.35 కోట్లు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కర్ణాటకలోని తుముకూరుకు చెందిన ఆద్యా హైజిన్ సొల్యూషన్స్ బీదర్‌కు చెందిన సంగమేష్‌కు రూ.లక్షల విలువైన వయాగ్రా మందులు సరఫరా చేసింది. అతని నుంచి నగేష్‌కు చేరాయి. చిలకలూరిపేటకు చెందిన కె.నరేంద్రబాబుకు అదే ప్రాంతానికి చెందిన వెంకటేశ్వర మెడికల్ ఎంటర్‌ప్రైజెస్ నుంచి 5.50 లక్షల స్ట్రిప్‌లు చేరాయి. వీరిద్దరూ కలిసి రెండేళ్ల కాలంలో రూ.12 కోట్లు విలువైన మందులను అనధికారికంగా రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా చేసినట్లు తేలింది. ఇదిలా ఉంటే ఇటీవల వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రజని ఔషధ నియంత్రణ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అక్రమ మందుల దందాపై స్పందించినట్లు సమాచారం. దీంతో ముంబై, గుజరాత్ ప్రాంతాల్లోని ఫార్మా కంపెనీల్లో సోదాలు చేసేందుకు రాష్ట్రం నుంచి ప్రత్యేక బృందాలు వెళ్లాయి. ఇప్పటికే కర్ణాటకలోని బెంగళూరు, తుముకూరు, హుబ్లీ, బీదర్ ప్రాంతాల్లో నాలుగు ఫార్మా ఏజెన్సీలపై ఏకకాలంలో దాడులు నిర్వహించారు.

## ఉంగుటూరులో అగ్ని ప్రమాదం


ఇంట్లో కాలిపోయిన సామగ్రి

**ఉంగుటూరు:** ఉంగుటూరులో ఓ డాబా ఇంట్లో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించి ఇంట్లో ఉన్న సామగ్రి కాలిబూడిదయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని రెడ్డి సత్యనారాయణకు చెందిన ఇంటికి తాళం వేసి నెల రోజులుగా గుడివాడలో ఉంటున్నారు. మంగళవారం అర్ధరాత్రి షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఇంట్లో ఉన్న ఏసీ, బీరువా, మంచం, టీవీ, ఫర్నిచర్, సామగ్రి, 100 డాలర్ల విదేశీ కరెన్సీ కాలిపోయాయి. స్థానికులు స్పందించి సమాచారం అందించడంతో తాడేపల్లిగూడెం అగ్నిమాపక అధికారి రామారావు, సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. వంట ఇంట్లో ఉండాల్సిన గ్యాస్ సిలిండర్ మధ్య గదిలో పేలిపోయి ఉండటంతో ఇంట్లో దొంగతనానికి వచ్చి గ్యాస్ లీక్ చేసి అంటించి ఉంటారనే అనుమానిస్తున్నారు. ప్రమాదంలో రూ.2.50 లక్షల ఆస్తినష్టం జరిగి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

## పాము కాటుకు బాలుడి మృతి

**ఏలూరు టౌన్:** గ్రామంలో కిరాణా కొట్టుకు వెళ్లిన ఓ బాలుడు పాముకాటుకు గురై మృతి చెందాడు. కాట్లంపూడికి చెందిన గుత్తుల హేమచందర్ (9) బుధవారం ఇంటి సమీపంలో కిరాణా కొట్టుకు వెళ్లగా, అక్కడ ఏదో తనని కుట్టిందని ఇంటికి వచ్చి తల్లిదండ్రులకు విషయాన్ని చెప్పాడు. బాలుడిని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి పాము కాటుకు గురైనట్లు నిర్ధారించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు.

## క్లుప్తంగా

**కోడిపందేలపై దాడులు**

**జంగారెడ్డిగూడెం రూరల్:** లక్కవరంలో కోడి పందేల స్థావరంపై ఎస్సై దుర్గామహేశ్వరరావు తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఈ దాడుల్లో కోడిపందేలు ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.7,270 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

**రెండు గ్రామాల్లో ఏడుగురి అరెస్టు**

**టి.నరసాపురం:** మండలంలోని బండివారిగూడెం, వీరభద్రవరం గ్రామాల్లో కోడిపందేల శిబిరాలపై బుధవారం ఎస్సై సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. బండివారిగూడెంలో నిర్వహించిన దాడుల్లో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రూ.6,500 నగదు, 2 కోడిపుంజులు, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. వీరభద్రవరంలో జరిగిన దాడిలో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.3,500 నగదు, 2 కోడిపుంజులు, 2 కోడికత్తులను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

**పెదవేగి:** అమ్మపాలెం వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇతను మృతి చెందినట్లు ఎస్సై ఎం.లక్ష్మణ్ చెప్పారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే 94407 96638 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని ఎస్సై కోరారు.



# ఆటోపై తాడిచెట్టు కూలి చిన్నారి మృతి


మర్రిబంధం వద్ద ఆటోపై తాడిచెట్టు కూలడంతో ధ్వంసమైన దృశ్యం


మృతి చెందిన చిన్నారి అన్షు

**మరో ఐదుగురికి గాయాలు**

**నూజివీడు:** ఈదురుగాలులకు ఆటోపై తాడిచెట్టు కూలి ఓ చిన్నారి మృతి చెందగా, మరో ఐదుగురికి గాయాలయ్యాయి. ఏలూరు జిల్లా నూజివీడు మండలం మర్రిబంధంలో బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. నూజివీడు మండలం సిద్ధార్థనగర్‌కు చెందిన బత్తుల పరిశుద్ధం, బత్తుల జార్జి, మిట్టగూడెంకు చెందిన రాచప్రోలు మాణిక్యం, ముసునూరు మండలం చెక్కపల్లికి చెందిన మారుమూడి చంద్రకాంత, మారుమూడి శ్రావణిలతో పాటు మనవరాలైన 17 నెలల చిన్నారి జిల్లాబత్తుల అన్షును తీసుకుని సీతారామపురంలో అనారోగ్యంతో ఉన్న కోడలు వద్దకు ఆటోలో వెళ్లి తిరిగి నూజివీడు వస్తున్నారు. సాయంత్రం 4 గంటల సమయంలో మర్రిబంధం వద్దకు వచ్చేసరికి ఈదురుగాలులతో కూడిన వర్షం పడుతుండటంతో ఒక్కసారిగా రోడ్డు పక్కన ఉన్న తాడిచెట్టు ఒక్కసారిగా వీరి ఆటోపై కూలింది. ఈ ప్రమాదంలో 17 నెలల చిన్నారి అన్షు అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన వారికి గాయాలయ్యాయి. ఈ ఘటనలో ఆటో పూర్తిగా ధ్వంసమవ్వగా, క్షతగాత్రులందరినీ హుటాహుటిన 108 వాహనంలో నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. నూజివీడు రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మాజీ సైనికోద్యోగుల సంక్షేమానికి కృషి

- జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్
- కోటదిబ్బలో అమర జవాన్ల స్మారక చిహ్నం ఆవిష్కరణ


అమర్ జవాన్ స్మారక చిహ్నం ఆవిష్కరించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

**ఏలూరు(మెట్రో)/ఏలూరు టౌన్:** మాజీ సైనికోద్యోగులు సంక్షేమానికి పూర్తి సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తామని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. స్థానిక కోటదిబ్బలోని జిల్లా మాజీ సైనికోద్యోగుల అసోసియేషన్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన అమర్ జవాన్ స్మారక చిహ్నాన్ని (ఐకాన్) కలెక్టర్ ఆవిష్కరించారు. తొలుత అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. వీరితో పాటు లెఫ్టినెంట్ జనరల్ కేఆర్ రావు, లెఫ్టినెంట్ జనరల్ కేజీ కృష్ణ, ఉండవల్లి లత అమర జవానుల స్మారక చిహ్నానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తనకు ఎన్‌సీసీలో హవల్దార్ సత్యరాజన్ శిక్షణ అందించారన్నారు. అనంతరం సివిల్ సర్వీస్‌కు ఎంపికైనట్లు తెలిపారు. ఐఏఎస్ శిక్షణ సమయంలో ఆర్మీకి సంబంధించిన శిక్షణను సిక్కిం బోర్డర్‌లో 15 రోజుల పాటు తీసుకున్నానని, అప్పుడే తాను సైనికుల బాధలు, కష్టాలు చూశానన్నారు. ఆ సమయంలో హవల్దార్ సత్యరాజన్ తమను గుర్తించి మాట్లాడటం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. మాజీ సైనికోద్యోగుల అసోసియేషన్‌కు కంప్యూటర్, ప్రింటర్, ఆసుపత్రి నిర్మాణానికి స్థలం కావాలని తనను కోరారన్నారు. త్వరలో వీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. మాజీ సైనికోద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని కలెక్టర్ స్పష్టం చేశారు. లెఫ్టినెంట్ జనరల్ కేఆర్ రావు, కేజీ కృష్ణ, ఉండవల్లి లత మాట్లాడారు. అసోసియేషన్ చైర్మన్ వాసుకి శర్మ మాట్లాడుతూ సైనికులు విధి నిర్వహణలో, ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారు చాలామంది ఉన్నారన్నారు. అమర జవాన్ల సేవలకు గుర్తుగా ఇక్కడ చిహ్నం ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.సుబ్బారావు, జనరల్ సెక్రెటరీ పీబీ రమేష్, డీఎస్పీ పైడేశ్వరారావు, తహసీల్దార్ బి.సోమశేఖర్ పాల్గొన్నారు.

# ఆక్వా మందుల షాపులపై దాడులు

**41 కిలోల యాంటీబయోటిక్స్ మందుల ముడిసరుకు స్వాధీనం**


తణుకులో అధికారులు స్వాధీనం చేసుకున్న ఆక్వా మందుల ముడిసరుకు

**తణుకు:** చేపల చెరువుల్లో విచ్చలవిడిగా వినియోగిస్తున్న యాంటీబయోటిక్స్ మందులను అక్రమంగా దిగుమతి చేసుకుని స్థానికంగా విక్రయిస్తున్న షాపులపై ఔషధ నియంత్రణ శాఖ అధికారులు మంగళవారం రాత్రి దాడులు నిర్వహించారు. తణుకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ షేక్ అబిద్ అలీ ఆధ్వర్యంలో తణుకులోని ఆక్వా ఫీడ్స్ అండ్ నీడ్స్ షాపులో తనిఖీలు చేశారు. హైదరాబాద్, నెల్లూరు ప్రాంతాల నుంచి పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకుంటున్న ముడి సరుకును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తణుకులోని సాయి అంబిక టవర్స్‌లో శ్రీలక్ష్మి ఆక్వా ఫీడ్స్ అండ్ నీడ్స్ పేరుతో నిర్వహిస్తున్న షాపులో ఈ తనిఖీలు చేపట్టారు. ఆల్‌బెండజోల్, సిప్రోఫ్లాక్సిన్, ఫ్యూరోజోలిడిన్, ఆక్సీటెట్రాసైక్లిన్, ఎండోఫ్లాక్సాసిన్, సెల్ఫామిథాక్సోజోల్, ట్రైమిథోప్రిమ్ వంటి ఏడు రకాల ముడి సరుకు మొత్తం 41 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు డెల్టామైత్రిన్, బ్యూడక్స్, టిక్‌టాక్ వంటి నిషేధించిన మందులను అధికారులు సీజ్ చేశారు. డ్రగ్ లైసెన్స్ లేకుండా మందులు విక్రయిస్తున్నట్లుగా గుర్తించామని, షాపుల యజమానులపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో తణుకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ షేక్ అబిద్ అలీతోపాటు భీమవరం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు, కానిస్టేబుల్ బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

# తపన ఫౌండేషన్ సేవలు విస్తృతం చేస్తాం


వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు ఉగాది పురస్కారాలు అందించిన గారపాటి చౌదరి

**ఏలూరు (టూటౌన్):** ఏలూరు జిల్లా వ్యాప్తంగా తపన ఫౌండేషన్ ద్వారా మరింత విస్తృతమైన సేవలు అందిస్తామని సంస్థ చైర్మన్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. ఫౌండేషన్ 15వ వార్షికోత్సవం, ఉగాది వేడుకల సందర్భంగా సత్రంపాడు సమీపంలోని పద్మావతి కన్వెన్షన్ సెంటర్లో బుధవారం సాయంత్రం ప్రముఖులకు ఉగాది పురస్కారాలను అందించారు. తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, రేణుక దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. గారపాటి చౌదరి నిర్వహించిన సేవా కార్యక్రమాలను తెలిపే విధంగా సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ రాసిన పాటను ఆవిష్కరించారు. అనంతరం గారపాటి చౌదరి మాట్లాడుతూ సరిగ్గా 15 ఏళ్ల క్రితం సమాజానికి ఏదో సేవ చేయాలనే తపనతో ఈ తపన ఫౌండేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఫౌండేషన్ ద్వారా ప్రజలకు అందించిన సేవలను వివరించారు. ఫౌండేషన్ ద్వారా లబ్ధి పొందిన పలువురు విద్యార్థులు వేదికపై మాట్లాడారు. అనంతరం వ్యక్తిగతంగా వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన పలువురు ప్రముఖులకు తపన ఫౌండేషన్ ఉగాది సేవల పురస్కారాలను గారపాటి చౌదరి, రేణుక దంపతులు తమ చేతులు మీదుగా అందించారు. పురస్కారాలు అందుకున్న వారిలో జంగారెడ్డిగూడెంకు చెందిన కొండపల్లి పండు, కన్నాపురానికి చెందిన కట్టా లక్ష్మి, ఏలూరుకు చెందిన అల్లం వెంకట సుబ్బారావు, కామవరపుకోటకు చెందిన వీరమల్లు మధుసూదనరావు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్, బుల్లితెర సీనియర్ నటి హరిత, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, పలువురు రాజకీయ, వ్యాపార ప్రముఖులు, ఆధ్యాత్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంజుమన్ వద్ద ఉద్రిక్తత

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** నగరంలోని అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం కార్యాలయం వద్ద బుధవారం రాత్రి ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ సంస్థ పాలకవర్గ ఎన్నికలు ప్రతి మూడేళ్లకోసారి నిర్వహించాల్సి ఉండగా, ప్రస్తుత పాలకవర్గం పదవీకాలం పూర్తయి ఎనిమిది నెలలు కావస్తున్నా ఎన్నికల ఊసు ఎత్తకపోవడంతో అంజుమన్ సంస్థకు సంబంధించిన కొంతమంది శాశ్వత సభ్యులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. వార్డుల వారీ ఎన్నిక ద్వారా 35 మంది సభ్యులను సంస్థ సభ్యులు ఎన్నుకుంటారు. వీరంతా కలిసి సంస్థ అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకుంటారు. అయితే గత పాలకవర్గం గడువు దాటి ఏడాది అయినా ఎన్నికలు నిర్వహించలేదు. అప్పట్లో కూడా ఇదే తరహాలో సభ్యులు ఆందోళన చేయడంతో ఎన్నికలు నిర్వహించారు. ఆ ఎన్నికల్లో పాత పాలకవర్గమే గెలిచిందని, కోర్టుకు వెళ్ళి తమకే పూర్తి మెజారిటీ ఉందని నిరూపించుకున్నారు.పాత పాలకవర్గం చూపిన దారిలోనే ప్రస్తుత కార్యవర్గం వెళుతూ ఎన్నికలపై ఎటువంటి ప్రకటనా చేయకపోవడంతో వ్యతిరేక వర్గం ఆందోళనకు దిగింది. ఈ నేపథ్యంలో ఆందోళన నిర్వహిస్తున్న వారితో ప్రస్తుత పాలకవర్గ సభ్యులు చర్చలు ప్రారంభించారు.

# మొక్కల ఆరోగ్యాన్ని ముందే పట్టేద్దాం

- నాణ్యమైన, ఆరోగ్యకర పంటలపై ప్రభుత్వం దృష్టి
- మండలానికో ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్
- రైతులకు అందుబాటులో ఉండే ఆర్బీకేల్లో సేవలు



పీహెచ్‌డీ కేంద్రం సేవలను అందించనున్న ఆకివీడు రైతు భరోసా కేంద్రం

**ఆకివీడు:** నాణ్యమైన, ఆరోగ్యకర పంటలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. పంటలలో తెగుళ్లను పరిశోధించి, వాటి నివారణ (చికిత్స) చర్యలు తీసుకునేలా బృహత్తర కార్యక్రమం తలపెట్టింది. ప్రతి మండలంలో ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్ (పీహెచ్‌డీసీ)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు వ్యవసాయ శాఖకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి మండలంలో సొంత భవనం కలిగి, రైతులకు అందుబాటులో ఉండే రైతు భరోసా కేంద్రం (ఆర్బీకే)లో పీహెచ్‌డీసీలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండే ఆర్బీకేలను ఎంపిక చేసే పనిలో నిమగ్నమయ్యారు.

**మూలకాల లోపాలపై శిక్షణ**

ఆయా మండలాల్లోని ప్రధాన పంటలపై వచ్చే తెగుళ్లు, సాంద్రత వంటి వాటిని పరీక్షించేందుకు ఆర్బీకే పరిధిలోని బీఎస్సీ, ఎమ్మెస్సీ అగ్రికల్చర్ అర్హత కలిగిన వీపీఏను శిక్షణకు ఎంపిక చేస్తారు. మూడు నెలల పాటు వారికి మూలకాలలో లోపాలు, సాంద్రత పరీక్ష, తెగుళ్ల ఆనవాళ్లను గుర్తించేలా శిక్షణ ఇవ్వనున్నారు. భూమిలో చౌడు శాతం, నీటిలో సెలినిటీ, ఎరువులలో సాంద్రత పరీక్షలపై తర్ఫీదునివ్వనున్నారు. సకాలంలో తెగుళ్లను ఎదుర్కొనే విధంగా, భూమి సాంద్రతను పెంచే విధంగా వీపీఏ తగిన సూచనలు, సలహాలను రైతులకు, వీపీఏలకు తెలియజేస్తారు.


**సారవంతమైన నేలలకు కృషి**

సారవంతమైన నేలల్ని కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వాలకంటే అధికంగా పచ్చిరొట్ట పెంపకానికి, సేంద్రియ ఎరువుల వినియోగానికి అధిక ప్రాధాన్యతనిస్తోంది. జిల్లాలో వచ్చే వేసవిలో పచ్చిరొట్ట సాగుకు ముందుగానే 500 క్వింటాళ్ల మినుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలను అందుబాటులో ఉంచింది. 50 శాతం సబ్సిడీపై రైతులకు విత్తనాలను సరఫరా చేసేందుకు సిద్ధం చేసింది. పచ్చిరొట్ట పెంపకంతో భూసారం పెరుగుతుంది. చౌడుబారిన పడనున్న భూములలో సారం పెంచేందుకు పచ్చిరొట్ట సాగు ఎంతగానో ఉపయోగపడుతుంది.

**వ్యక్తిగతంగానూ వ్యవసాయ పనిముట్ల పంపిణీకి చర్యలు**

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపుల ద్వారా రైతులకు మరిన్ని ప్రయోజనాలు కలుగనున్నాయి. ఆర్బీకేల ద్వారా గ్రామాల్లోని రైతులు గ్రూపులుగా ఏర్పడి వ్యవసాయ సామగ్రిని ఇప్పటివరకు పొందుతున్నారు. అయితే రానున్న రోజుల్లో అర్హులైన ప్రతి రైతుకూ వ్యక్తిగతంగా వ్యవసాయ పనిముట్లు అందజేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. గ్రామాల్లోని ఆర్బీకేలకు శాశ్వత భవనాల నిర్మాణం పూర్తి చేసేందుకు నిధులు కేటాయించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి 21 రోజుల్లోనే సొమ్ము జమచేసేలా బడ్జెట్‌లో 55,401.58 కోట్లు, ఇతర పంటల కొనుగోలుకు రూ.7,156 కోట్లు కేటాయించడం విశేషం.

**తెగుళ్ల నుంచి పంటల రక్షణే లక్ష్యం**



చీడ పీడల నుంచి పంటలను కాపాడేందుకు ప్రభుత్వం డయాగ్నోస్టిక్ సెంటర్లు ఏర్పాటు చేయనుంది. ప్రతి మండలంలోని ఒక ఆర్బీకే కేంద్రం వద్ద పీహెచ్‌డీసీని ఏర్పాటు చేసి, దీనిలో బీఎస్సీ, ఎమ్మెస్సీ అగ్రికల్చరల్ చేసిన వీపీఏను నియమించి పూర్తి బాధ్యతలు అప్పగిస్తారు. పంటలలో తెగుళ్లను ఎప్పటికప్పుడు గుర్తించి సకాలంలో రైతులు నివారణ చర్యలు తీసుకునేలా ఈ కేంద్రాలు సేవలు అందిస్తాయి.

– జెడ్.వెంకటేశ్వర్లు, జేడీఏ, పశ్చిమగోదావరి జిల్లా

## క్లుప్తంగా

### ద్వారకాతిరుమలేశునికి రూ.3లక్షలు విరాళం



శ్రీవేంకటేశ్వరస్వామివారికి విరాళం అందజేసిన కొప్పిశెట్టి చంటి - అనంతలక్ష్మి దంపతులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ద్వారకాతిరుమల వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన మోడ్రన్, ప్రగతి జూనియర్ కళాశాల అధినేత కొప్పిశెట్టి రమణయ్య (చంటి) – అనంతలక్ష్మి దంపతులు రూ.3లక్షలు విరాళంగా బుధవారం అందజేశారు. బంగారు గోపురానికి రూ.1,00,116లు, నిత్యాన్నదానినికి రూ.1,00,116లు, గోశాల అభివృద్ధికి రూ.1,00,116లు వెరసి రూ.3,00,348లను సమకూర్చారు. ఈ కార్యక్రమంలో కొప్పిశెట్టి ధనుష్, శ్రీహిమవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆసరాతో ఆడపడుచులకు ఆర్థిక భరోసా

- మూడో విడత రుణం అందించేందుకు రంగం సిద్ధం
- 25న సీఎం జగనన్న చేతుల మీదుగా దెందులూరులో ప్రారంభం



మూడో విడత లబ్ధిదారులతో ఏపీఎం లక్ష్మి

పెంటపాడు: మహిళల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోంది. 2019 ఏప్రిల్‌లో 11 నాటికి డ్వాక్రా సంఘాల సభ్యులకు ఎంతెంత రుణం ఉందో అదంతా దశల వారీగా మాఫీ చేస్తానని ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఏటా ఆసరా పేరుతో లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా జమచేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కరోనా వంటి కష్టకాలంలోనూ ఆసరా పేరుతో వారి ఖాతాల్లో నేరుగా సొమ్ము జమ చేశారు. ఇప్పటికే రెండు విడతలు ఇవ్వగా మూడో విడత ఈ నెల 25న సొమ్ము విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ ఏడాది కూడా ఆసరా పథకంలో భాగంగా డ్వాక్రా యానిమేటర్లతో లబ్ధిదారుల బయోమెట్రిక్ లను సేకరిస్తున్నారు.

**పూర్తైన వివరాలు సేకరణ**

ఆసరా పథకం మూడో విడత అమలుకు సంబంధించి లబ్ధిదారుల వివరాల సేకరణ వైఎస్సార్ వెలుగు సిబ్బంది ఇప్పటికే పూర్తి చేశారు. గత రెండేళ్లుగా ఆసరా సొమ్ములు తీసుకొంటున్న లబ్ధిదారులు బయోమెట్రిక్ తీసుకొంటున్నారు. అర్హత కలిగి ఉండి ఎవరైనా ఏడాది లోపు మరణించి ఉంటే వారి నామినీకి సొమ్ము చెల్లించే విధంగా నమోదు చేస్తున్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో మూడు విడతలుగా ఆసార ఆర్థిక సాయం అందించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 25న సీఎం జగనన్న చేతుల మీదుగా ఈ కార్యక్రమంలో సొమ్ములు విడుదల అవుతాయి. పూర్తైన వెంటనే గూడెం మండలం, పెంటపాడు మండలాల్లో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ద్వారా పలు చోట్ల సభలు నిర్వహించి సొమ్ముల చెక్కులను అందిస్తారు. ఇప్పటివరకు రెండు విడతల్లో 25 కోట్ల 91 లక్షల 50 వేలు పడింది. కాగా మూడో విడతగా 13,490 మంది సభ్యులకు గాను 1349 గ్రూపులు ఉన్నారు. 12 కోట్ల 95 లక్షల 75 వేలు మూడో విడతగా రానుందని ఏపీఎం లక్ష్మి తెలిపారు.

### ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



ఆసరా పథకంలో భాగంగా మా గ్రూపుకి ఇప్పటికే రెండు విడతలలో కలిపి రూ. 6,94,112 రుణ మాఫీచేసారు. మూడో విడతగా రూ. 1.79.529 నగదు జమ చేయనున్నారు. మాసంఘం ఆర్థిక ఎదుగుదలకు ఆసరా పథకం ఎంతో ఉపయోగపడుతోంది. దీనికి కారణమైన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. – రామ సీతా, రావిపాడు మండలం

### బయోమెట్రిక్ సేకరణ పూర్తి



ఆసరా పథకంలో లబ్ధిపొందిన సభ్యులకు మూడో విడత బయోమెట్రిక్‌ల సేకరణ పూర్తయ్యింది. ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఈ నెల 25న నేరుగా వారి ఖాతాల్లో జమ అవుతోంది. ఇప్పటికే పెంటపాడు ప్రభుత్వ బేసిక్ పాఠశాలలో ఈనెల 31న జరిగే సమావేశానికి లబ్ధిదారులు అంతా హాజరుకావాలి.
– వై. లక్ష్మి, ఏపీఎం పెంటపాడు మండలం

### ఉపాధి కూలీలకు పనులు కల్పించాలి



ఉపాధి కూలీలనుద్దేశించి మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పథకం కూలీలకు తక్షణం పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని మాధవరం గ్రామంలో ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. ఐదు వారాల నుంచి పనిచేస్తున్నా ఇప్పటికీ ఒక్క వారం డబ్బులు కూడా పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలందరికీ వేతన బకాయిలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాలంగి లక్ష్మీ, మంద రామారావు, మామిడిపల్లి స్వర్ణ, పెనుమాక సుబ్బమ్మ, కొల్లి లక్ష్మీ, ఏలూరి కనకరాజు, కండెల్లి నాగేశ్వరరావు, పెను మాక సంసోను, తానేటి ఆనందరావు, కొడవటి పద్మ, ఆకుమర్తి చిన్ని, పొడవటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

### బలుసులమ్మకు విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): శోభకృత్ నామ సంవత్సరం ఉగాది మహోత్సవాలు సందర్భంగా ఐదో రోజు బుధవారం ఉదయం నుంచి పట్టణ ఇల వేల్పు బలుసుల మ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు తండోపతండాలుగా హాజరై అమ్మవారి దివ్యదర్శనం చేసుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులచే అమ్మవారికి విశేష అలంకరణ, విశేష పూజలు, పంచహారతులు, అమ్మవారికి ఊంజల్ సేవ జరిగాయి. అమ్మవారిని దర్శించిన వారిలో మునిసిపల్ కమిషనర్ బాలస్వామి దంపతులు ఉన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కొట్టు అంజిబాబు, వైస్ చైర్మన్ వట్టిపోలు రాము, పెదప్రోలు భాస్కరాచార్యులు, గుండుబోగుల నాగు, వెలనాటి సత్తిబాబు ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు హాజరైయారు. ఉగాది సందర్భంగా అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పుట్టింటి బలుసులమ్మ ఆలయం వద్ద పాతూరు యూత్ వారిచే విశేష పూజలు, అన్నప్రసాదాలు భక్తులకు అందించారు.

## అమ్మవార్ల ఆలయాలకు పోటెత్తిన భక్తజనం



అత్తిలిలో సోమాలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అత్తిలి: అత్తిలి గ్రామదేవతగా పూజలందుకుంటున్న పోలేరమ్మ అమ్మవారి ఆలయంలో బుధవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరైయ్యారు. ఆలయ ప్రాంగణాన్ని నవధాన్యాలతో మొలకెత్తిన జాజరి బుట్టలను అలంకరించారు. ఉత్సవాలు సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఉగాది సందర్భంగా అత్తిలిలో దుర్గమ్మ తాడికి భక్తులు పూజలు చేశారు. భక్తులు పానకం, సలివిడి ప్రసాదాన్ని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్దగల సోమాలమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈసందర్భంగా అమ్మవారి జాతర మహోత్సవం ఘనంగా జరిపారు. ఆసాదుల గరగన్నృత్యాలు, డప్పువాయిద్యాల నడుమ సలివిడి, పానకాల కావిళ్లతో గ్రామంలో ఊరేగి, అమ్మవారికి సమర్పించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పైబోయిన సత్యనారాయణ, పైబోయిన శ్రీను, యడ్లపల్లి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

బల్లిపాడు గ్రామ దేవత శ్రీగోగులమ్మ అమ్మవారి ఆలయంలో ఉగాది వేడుకలను ఘనంగా జరిపారు. అమ్మవారిని దర్శనానికి భక్తులు బారులు తీరారు. బల్లిపాడు మదనగోపాలస్వామి ఆలయంలో ఉగాది వేడుకలను ఘనంగా జరిపారు. స్వామివారికి విశేష పూజలు జరిపారు. ఈసందర్భంగా పంచాంగ శ్రవణం చేశారు. స్వామివారి ఊరేగింపు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

### గుర్తు తెలియని వ్యక్తిపై ఔదార్యం



వ్యక్తికి చికిత్స అందజేస్తున్న దృశ్యం

తణుకు: తణుకు పట్టణంలోని నిరాదరణకు గురై తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్న గుర్తు తెలియని వ్యక్తిని అక్కున చేర్చుకుని వైద్యం అందజేసిన ఘటన బుధవారం తణుకు పట్టణంలో చోటు చేసుకుంది. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ప్రధాన ద్వారం వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని కొందరు వాకర్లు గమనించారు. అప్పటికే కొందరు అల్పాహారం పెట్టినప్పటికీ స్పందన లేకపోవడంతో తణుకు పట్టణానికి చెందిన సామాజిక న్యాయపోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పేరూరి మురళీ కుమార్ ఆధ్వర్యంలో పలువురు వాకర్లు 108 అత్యవసర వాహనానికి సమాచారం అందించారు. బాధితుణ్ని తణుకు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు.

## ప్రజలకు అమ్మవారి అశీస్సులు కలగాలి



బలుసులమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: శోభకృత్ నామ సంవత్సరం ప్రజలందరికి శుభం జరగాలని ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అభిలషించారు. శోభకృత్ ఉగాది పర్వదినాన్న పురదేవత శ్రీ బలుసులమ్మ అమ్మవారికి మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలుసులమ్మ అమ్మవారి ఆశీర్వాదంతో తాను రాజకీయంగా ఉన్నత శిఖారాలకు పొందాన్నారు. దేవదాయ శాఖ మంత్రిగా రాష్ట్రంలోని దేవాలయాలతోపాటు నియోజకవర్గంలోను దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. శ్రీ బలుసులమ్మ వారి దర్శనార్థం నిత్యం వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. అమ్మవారి దేవస్థానం అభివృద్ధిలో ప్రజలందరూ తమవంతు పాలుపంచుకొని అమ్మవారికి రజిత కవచ ధారణకు అందించిన సహకారం చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కోనేరు, అన్నప్రసాద వితరణకు ప్రత్యేక భవనాల నిర్మాణం త్వరలో పూర్తి చేస్తున్నామన్నారు. శోభకృత్ ఉగాది శుభాకాంక్షలను ప్రజలకు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొట్టు అంజిబాబు, నాయకులు వెలనాటి సత్తిబాబు, కొట్టు విశాల్, కొలుకులూరి ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

### వాటర్ డిస్పెన్సరీ బహూకరణ



జగన్నాథపురం పంచాయతీకి వాటర్ డిస్పెన్సరీని బహూకరించిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం పంచాయతీకి బుధవారం వాటర్ డిస్పెన్సరీని బహూకరించారు. గ్రామానికి చెందిన వరలక్ష్మి సిమ్మెంట్ డిజైనర్ అధినేత మంచాల సత్తిపండు ఆర్థిక సహకారంతో సమకూర్చారు. దీనిని గ్రామ సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక ప్రారంభించారు. వివిధ పనులపై పంచాయతీకి వచ్చే ప్రజల మంచినీటి సౌకర్యార్థం దాత సత్తిపండు ఈ వాటర్ డిస్పెన్సరీని ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు యర్రంశెట్టి బసవయ్య, తులా మస్తాన్, అడ్డాల గోపీ, కరిపోతుల పుల్లారావు, ముప్పిడి లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

## సాహితీ సేవలు ప్రశంసనీయం



తాడేపల్లిగూడెంలో సాహితీ పురస్కారాలతో సత్కరించిన దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తెలుగు సాహితీ సమాఖ్య సాహితీ సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. శ్రీశోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను తెలుగు సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ధనా రెసిడెన్సీలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. అనంతరం కవి సమ్మేళనం, బ్రహ్మశ్రీ గోదావరి ప్రభాకర శాస్త్రిచే పంచాంగ శ్రవణం చేశారు. అలాగే, పాటోలు సత్యనారాయణ స్మారక కమిటి చైర్మన్ చెన్నా నాగేంద్రరావు చేతుల మీదుగా అనకాపల్లి ఎంఎం కళాశాల విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు కొట్టే కోటారావు, మధురకవి చిర్రావూరి సూర్యానారాయణలకు సాహితీ పురస్కారాలు అందజేశారు. తొలుత ఇటీవల మృతి చెందిన ఏఆర్‌కేఎస్ఎన్.మూర్తి, చీతిరాల వెంకటరమణయ్యలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సాయిశ్రీ, జంధ్యాల నాగేశ్వరరావు, కొడాలి రమేష్‌బాబు, లక్ష్మణరావు, శారద, దత్తాత్రేయ, కె.నూకరాజు, శిరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### మావుళ్లమ్మకు బంగారం సమర్పణ



మావుళ్లమ్మవారికి బంగారం సమర్పిస్తున్న భక్తులు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మ అమ్మవారికి భీమవరానికి చెందిన యశ్వంత్ వెంకట వెంకట దుర్గా మణికంఠ, జస్వంత్ సూర్య వినాయక కుటుంబ సభ్యులు 8 గ్రాముల బంగారాన్ని సమర్పించారు.

## కట్లమ్మను దర్శించుకున్న కొట్టు విశాల్



గ్రామ దేవత కట్లమ్మ వారిని దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువనేత కొట్టు విశాల్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని బంగారుగూడెం గ్రామంలో వేంచేసియున్న గ్రామదేవత కట్లమ్మవారిని బుధవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువనేత కొట్టు విశాల్ దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ మర్యాదలతో ఆలయ కమిటి స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపించారు. ఈ సందర్భంగా గ్రామ ఆడపడుచుల సహకారం రూ.1.20లక్షలతో తయారు చేయించిన వెండి కిరీటాన్ని అమ్మవారికి అలంకరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సేవాదళ్ మండల చైర్మన్ కొండుబోయిన కృపావరం, మాజీ ఎమ్పీటీసీ బుర్ల కట్లయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు మాకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, నాయకులు బుర్ల వెంకటేశ్వరరావు, గుండుగొల్లు నాగేశ్వరరావు, మెడంకల శ్రీను, పచ్చిపులుసు రాజా, కె.ఏసుటోనీ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా నాగమ్మ తల్లి గరగోత్సవం

తణుకు అర్బన్: ఉగాది సందర్భంగా తణుకు జాతీయరహదారి గౌతమీ సాల్వెంట్ సమీపంలోని శ్రీచక్రసహిత నాగదుర్గాదేవి తల్లి (నాగమ్మ తల్లి) ఆలయంలో గరగోత్సవం, పానకాలు పంపిణీ కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. బుధవారం ఉదయం నాగమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆలయంలోని గరగలను ప్రత్యేకంగా అలంకరించి మహిళలు తలకెత్తుకుని గరగోత్సవంలో పాల్గొన్నారు. స్థానిక ఆలయ ఏరియాతో పాటు పైడిపర్రు స్వర్ణదుర్గ ఆలయం వరకు ఈ గరగోత్సవాన్ని నిర్వహించారు. నాదస్వరాలు, తీన్‌మార్ డప్పులతో పయనమైనా అమ్మవారి గరగలకు దారి పొడవునా మహిళలు పూజలు నిర్వహించి సాంబ్రాణి పొగలు వేస్తూ సాగనంపారు. ఆలయ కమిటీ నిర్వాహకులు కాసూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గరగోత్సవంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కంచుమర్తి విశ్వేశ్వరరావు, ఆలయంలో సేవ చేసే మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### కుంగుతున్న రోడ్డు

నరసాపురం: పట్టణంలోని గోదావరిగట్టు రోడ్డు ధ్వంసమవుతోంది. పడవలరేవు నుంచి కొండాలమ్మగుడి వరకూ రోడ్డుకు పలు చోట్ల గోతులు పడ్డాయి. రోడ్డు చాలా చోట్ల కంగిపోయింది. దీంతో రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు గుండా నిత్యం వేలాదిమంది ప్రయాణిస్తుంటారు. రోడ్డు సవ్యంగా లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు రోడ్డు మరమ్మతులపై దృష్టి పెట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

### చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



బ్రోచర్స్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 28 29 తేదీలలో ఢిల్లీలో మాలమహానాడు నిర్వహిస్తున్న హలో మాల చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని చినఅమిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బ్రోచర్స్ విడుదల చేసి ఆయన మాట్లాడారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద లక్షలాది మంది నిరసనతో వర్గీకరణ భూతాన్ని తిప్పికొట్టాలన్నారు. ఎస్సీ వర్గీకరణ చెల్లుబాటుకాదని గతంలో సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం వర్గీకరణ భూతాన్ని ముందు పెట్టి మాల, మాదిగల మధ్య చిచ్చు పెడుతోందని విమర్శించారు. రాష్ట్ర కార్యదర్శి సంధి జయరాజు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నేతల సువర్ణరాజు, నన్నేటి నాగరాజు, మానుకొండ కిరణ్, పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరూ గోవులను పూజించాలి



కడియద్ద గ్రామంలోని రామాలయం వద్ద గోవులకు దాణా అందజేస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కడియద్ద గ్రామంలోని రామాలయం వద్ద గోవులకు తాడేపల్లిగూడెం వాసవి క్లబ్ బుధవారం ఐదు బస్తాల దాణా అందజేశారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సేవా కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వాసవి క్లబ్ జోన్ చైర్మన్ నున్న నాగలక్ష్మి సుందరం తెలిపారు. సకల దేవతా స్వరూపిణి అయిన గోవులకు సేవ చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రతీ ఒక్కరూ గోవులను పూజించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు చైర్మన్ పులవర్తి రాంపండు, క్లబ్ అధ్యక్షుడు శీమకుర్తి రాజశేఖర్ గుప్తా, కార్యదర్శి పసుమర్తి అనిల్, చలంచర్ల మురళీమోహన్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

### ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

వీరవాసరం : కొణితివాడలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ మూడో రోజు బుధవారం ఉత్సాహంగా సాగింది. కొణితివాడ, తణుకు, నరసాపురం, ఉండి, తాడేపల్లిగూడెం, ఆచంట జట్ల మధ్య పోటీలు ఆసక్తిగా సాగాయి. ముందుగా సీనియర్ కబడ్డీ క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. నాగరాజు భాస్కర్ రాజు, యరకరాజు చిన బాబు, గొలగాని సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

### ముత్యాలమ్మవారి వెండి చీరకు విరాళం



ముత్యాలమ్మ వెండి చీరకు విరాళం అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబపురం ముత్యాలమ్మవారి వెండి చీర నిమిత్తం ఉప్పాకపాడు గ్రామానికి చెందిన మాకా శ్రీనివాస్ దంపతులు రూ.10,116లను, కామిశెట్టి మురళీకృష్ణ అర కిలో వెండిని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మాకా బాలాజీ, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.హరేరామ్‌ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ హరిబాబు, అర్చకులు పాల్గొన్నారు.

### పేకాట శిబిరంపై దాడి

భీమవరం అర్బన్ : భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఎస్సై మోహన్‌రావు తన సిబ్బందితో పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. నరసింహపురం గ్రామంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1800 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై మోహన్‌రావు చెప్పారు.

# ఘనంగా ఉగాది వేడుకలు



అత్తిలి మండలం బల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉగాది పచ్చడిని విద్యార్థులకు పెడుతున్న హెచ్‌ఎం దత్



ఉగాది వేడుకల్లో పంచాంగ శ్రవణం చేస్తున్న రామకృష్ణ శర్మ

అత్తిలి: శోభకృత్ నామ సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలు, భోగ భాగ్యాలతో ఆనందంగా ఉండాలని, విద్యార్థులందరూ బాగా చదువుకుని ఉన్నత స్థానాలను చేరుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్‌సీఎం దత్ చెప్పారు. అత్తిలి మండలం బల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉగాది సంబరాల్లో హెచ్‌ఎం దత్ మాట్లాడుతూ ప్రకృతిని మనం గౌరవించినప్పుడే మనమంతా సుఖ సంతోషాలతో ఉండగలమని, ప్రకృతిలో మనం కూడా ముఖ్య భాగమని తెలియజేసేవే పండుగలు అని అన్నారు. అందులో తెలుగువారికి అత్యంత ప్రధానమైన మొదటి పండుగ ఉగాది అని చెప్పారు. పాఠశాల సంస్కృత పండితులు సోమాంచి పురుషోత్తం శోభకృత నామ సంవత్సర పంచాంగ శ్రవణంలో రాబోయే సంవత్సరంలో వివిధ రాసుల వారికి రాశి ఫలితాలు, ఆదాయ వ్యయాలు, రాజపూజ్యం, అవమానాలను వివరిస్తూ శోభకృత్ నామ సంవత్సరంలో విద్యార్థులందరూ తమ తమ చదువుల్లో మరింత శోభిల్లాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షర్మిల, యామిని, ఆత్మలింగం, మల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, హర్ష, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

**సీనియర్ సిటిజన్లకు ఉగాది పురస్కారాలు**

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో బుధవారం ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘ అధ్యక్షుడు వెంపలి నారాయణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని గ్రంధి సత్యనారాయణ, ఇందుకూరి రమాకాంత్ దంపతులకు ఉగాది పురస్కారాలు అందజేశారు. ముందుగా బ్రహ్మశ్రీ పల్లావఝుల రామకృష్ణ శర్మచే పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు వీకే.వీరారావు, గరికపాటి సుబ్రహ్మణ్య శర్మ, దాసం నాగేశ్వరరావు, జి.హరికుమార్ పాల్గొన్నారు.

**గాయత్రీ కల్యాణ మండపంలో పంచాంగ శ్రవణం**

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి గాయత్రీ కల్యాణ మండపంలో ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం వెలవలపల్లి బాలసుబ్రహ్మణ్య శర్మచే పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం భావరాజు సత్యగోపాలకృష్ణమూర్తి, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ ఏఈ ఆంద్రు వెంకటరమణమూర్తి, సంగీత విద్వాంసురాలు యద్దనపూడి అనంతలక్ష్మిలను ఉగాది పురస్కారాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు పుల్లాభొట్ల వెంకట సూర్యనారాయణమూర్తి, కోశాధికారి ప్రవా శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శి గరికిపాటి బాపయ్య శర్మ, కలిగొట్ల శ్రీనివాస్, రౌతుల రాజా పాల్గొన్నారు.

**ఘనంగా వాకర్స్‌చే ఉగాది ఉత్సవాలు**

తాడేపల్లిగూడెం (టీఓసీ): శోభకృత్ నామ సంవత్సరం ఉగాది మహోత్సవాలు సందర్భంగా ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ వారిచే బుధవారం అసోసియేషన్ కార్యాలయం వద్ద వేడుకలు ఘనంగా జరిగాయి. సాంప్రదాయ దుస్తులలో ఉగాది పండుగను జరిపారు. వక్తలు మాట్లాడుతూ అందరు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఉగాది పచ్చడిని అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సీనియర్ సిటిజన్ నాగరత్నం, అధ్యక్షుడు కురుమళ్ళ వెంకటాచలం, కార్యదర్శి పి.కుమారస్వామి, కోశాధికారి పీవీ పరమాత్మ, ప్రవా శ్రీనివాస్, కప్పల నరసింహమూర్తి, బాకా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.